30 రోజుల ప్రణాళిక

- ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం
- అధ్యాపక బృందం చొరవ
- గ్రామాలకు వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులతో సమావేశాలు


కిష్టయ్యపల్లిలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంచి ఫలితాలు సాధించాలని ఓ కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఇంటర్ విద్యార్థులు ఇంటివద్ద ఎలా చదవాలనే సూచనలు కూడా అందిస్తోంది. ఇందుకోసం ఆ కళాశాల ప్రిన్సిపాల్ గ్రామ గ్రామానికి వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలలో చదివితేనే మంచి మార్కులు వస్తాయనే అపోహ తొలగించేందుకు ఆ అధ్యాపక బృందం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ పట్ల అభినందిస్తున్నారు.

ఆ వాతావరణం కల్పించేందుకు...

జిన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అందరూ మంచి మార్కులతో పాస్ కావాలని ర్యాంకులు సాధించాలని లక్ష్యంతో విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇస్తున్నారు. పగటిపూట కళాశాల తరగతుల్లో చదివించడమే కాకుండా ఇంటికి వెళ్లిన తర్వాత కూడా ఎలా చదవాలి అనే అంశంపై కూడా సలహాలిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు కళింగ కృష్ణ కుమార్ తెలిపారు. విద్యార్థులు కళాశాల నుంచి సాయంత్రం తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టే విధంగా అనుకూల వాతావరణాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కల్పించాలన్నారు. ఇందుకోసం విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళిక

ప్రత్యేకంగా 30 రోజుల ప్రణాళిక ఏర్పాటు చేసి ఏరోజు ఏం చదవాలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ రోజు ఏ సబ్జెక్టు రివిజన్ చేయాలో స్పష్టంగా నిర్దేశించారు. ప్రతీరోజు సాయంత్రం ఒక గ్రామాన్ని ఎంచుకొని, విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఓ చోటికి చేర్చి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షల సమయం ఆసన్నం కావడంతో తమ పిల్లలను ఇంటి పనులు అప్పగించకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే వెసులుబాటు కలిగించాలని సూచించారు. కళాశాల నుంచి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత తమ పిల్లలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇంట్లో టీవీ, మొబైల్ ఫోన్, ఇంట్లో పనులు వంటి వాటికి దూరంగా ఉంచి చదివించేలా అవగాహన కల్పించారు. పరీక్షల సమయం వరకు చదువు తప్ప మరోవైపు దృష్టి మళ్లించకుండా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ 30 రోజుల ప్రణాళికకు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అపూర్వ స్పందన లభిస్తుంది.

ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా...



ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులే ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే అపోహను తొలగిస్తాం. ఉత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాము. విద్యార్థులకు అందుకు తగిన విధంగా శిక్షణ సలహా సూచనలు అందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు.

-కళింగ కృష్ణ కుమార్
జిన్నారం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్

సర్వేను అడ్డుకున్న జేఏసీ నాయకులు


అధికారులతో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): డంప్‌యార్డ్ వద్దంటూ గుమ్మడిదల మున్సిపాలిటీలో చేపట్టిన నిరసన శుక్రవారం 17వ రోజుకు చేరుకుంది. రైతులతో కలిసి మండల జేఏసీ నాయకులు డంప్‌యార్డ్ సర్వేను అడ్డుకున్నారు. జేఏసీ నాయకులు మద్దుల బాల్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మంద చంద్రారెడ్డి, శ్రావణ్ రెడ్డి పనులు ఆపాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థకు అనుకూలంగా అధికారులు సర్వే చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో డంప్‌యార్డ్ ఏర్పాటు ప్రక్రియ జరగదని నినాదాలు చేశారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక సర్వే పనులు నిలిపివేశారు. అలాగే ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటు పనులను ప్రభుత్వం విరమించుకోవాలని గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన మార్కండేయ దేవాలయం ప్రారంభోత్సవ ఉత్సవాలను వచ్చేనెల 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఖేడ్ పద్మశాలి సంఘం బాధ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్రవారం సంఘం బాధ్యులు వైదికపురోహితులు బ్రహ్మశ్రీ గురురాజుశర్మతో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిలను కలిసి అందజేశారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాస్‌కు
చెర్ల గోపులారం ప్రజలు వినతి


ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెర్ల గోపులారం గ్రామస్తులు

కొండాపూర్(సంగారెడ్డి): విధులకు హాజరు కాని గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని చెర్ల గోపులారం గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ...సమగ్ర సర్వే సమయంలో కూడా సరిగ్గా విధులు నిర్వర్తించకపోవడంతో చాలామంది నిరుపేద గ్రామస్తులు ప్రభుత్వ పథకాలను అందుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా ప్రతీ రోజు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శి గ్రామానికి ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి రూరల్ పరిధిలోని పసల్వాది గ్రామంలో చాక్లెట్ ఆశ చూపి ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. సదాశివపేట పట్టణానికి చెందిన మహమ్మద్ ఖలీమ్ అలియాస్ నావేద్ (24) గతంలో పలు దొంగతనాలు, అత్యాచారం కేసులో నిందితుడు. సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధితోపాటు బోరబండ, బీడీఎల్ భానూర్ స్టేషన్ల పరిధిలో ఇతడిపై నాలుగు కేసులు ఉన్నాయి. అయితే కొద్దిరోజులుగా సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్‌లో నివాసం ఉంటున్న అతడి అక్క, బావ వద్ద చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. ఈ నెల 20న రాత్రి సమయంలో ఓ బాలికలకు మాయమాటలు చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడగా...స్థానికులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం నావేద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌ఎం


సిబ్బందిని సత్కరిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

జహీరాబాద్: స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రాన్ని రీజినల్ మేనేజర్ ప్రభులత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి అనే విషయాల గురించి తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుసేన్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజి ఇన్‌చార్జి తిరుమలేష్ పాల్గొన్నారు. శిక్షణలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన సిబ్బందిని సత్కరించారు.

సంక్షిప్త వార్తలు

◆ పశువుల పాక పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో పశు పోషకులకు ప్రోత్సహించేందుకు మంజూరు చేసిన పశువుల పాక నిర్మాణాన్ని ఎంపీడీఓ సత్తయ్య శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తడ్కల్ శివారులో అన్ని కొలతలతో నిర్మించిన మైతాబ్‌బీకి చెందిన పశువుల పాకకు రూ. 91,676లు మంజూరైనట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. దీంతో పాటు తాగునీటి తొట్టి సైతం నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింలు, లబ్ధిదారుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

◆ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద ఛత్రపతి శివాజీ, మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పల్లెపు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

◆ నేటి నుంచి రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కేరూర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆయల 21వ వార్షికోత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సోమవారం భోనాల ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు పెద్దపట్ల శోభారాణి, కిష్టయ్యగౌడ్ తెలిపారు.

◆ మందుబాబులకు రెండురోజులు జైలుశిక్ష

సంగారెడ్డి క్రైమ్: మద్యం తాగి వాహనం నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన నలుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్షతోపాటు ఇద్దరికి రూ.1,500 మరో ఇద్దరికి రూ.1000 జరిమానా విధించింది. ఈ మేరకు జిల్లా అదనపు న్యాయమూర్తి షేకీల్ అహ్మద్ సిద్దిఖీ తీర్పు వెల్లడించినట్లు సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమాన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్,బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురు పట్టుబడిన విషయం తెలిసిందే.

◆ ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలోని సాహితీ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో నరాల సమస్యలు, ఎముకల నొప్పులు, షుగర్, బీపీ వంటి సమస్యలపై నిపుణులైన వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్య సమస్యలకు తగిన సలహాలు, చికిత్స అందించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు రాము తెలిపారు.

◆ ఘనంగా స్వయంపాలన

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రమైన మొగుడంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం. అనురాధ ఉపాధ్యాయలు అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్వయంపాలన దినోత్సవాలు దోహదపడతాయన్నారు.

◆ బీజేపీతోనే అన్ని వర్గాల సంక్షేమం

జహీరాబాద్: బీజేపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరఫున జహీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలిసి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం జహీరాబాద్, వెంకటాపూర్, కుప్పానగర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రచారంలో నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి ఎస్.జగన్నాథ్, పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపల్లిలో అఖండ హరి నామ సప్తాహం ప్రారంభం


సప్తాహంలో పాల్గొన్న భజనకారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ఎంపల్లి కాశీ విశ్వనాథ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం అఖండ హరి నామ సప్తాహం ప్రారంభించినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు సప్తాహం, కాకడా హారతి, అన్నదానం, కీర్తన, భజన, జాగరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం రాత్రి గజేంద్ర ఆశ్రమానికి చెందిన కరణ్ గజేంద్ర భారతి మహారాజ్ కీర్తనం ఉంటుందని తెలిపారు.

గరిష్ట వేతనం అందేట్లు పనులు కల్పించండి

ఎంపీడీఓ సత్తయ్య


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ప్రతీరోజు గరిష్ట వేతనం అందేట్లు పనులు కల్పించాలని ఉపాధి సిబ్బందికి ఎంపీడీఓ సత్తయ్య శుక్రవారం ఆదేశించారు. మండలంలోని తడ్కల్ గ్రామంలో ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు సాయిలు పంటచేనులో గుళికరాళ్ల కట్టలు వేసే పనులను ఎంపీడీఓ పరిశీలించారు. తడ్కల్ గ్రామ శివారులో 220 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు అవగాహన కల్పిస్తూ మూడు మీటర్ల పొడువు, ఒక మీటరు వెడల్పుతో రెండు అడుగుల ఎత్తుగా కట్టలు వేస్తే గరిష్టంగా రూ. 300లు వేతనం లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సింలు, టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణుదాస్, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

రైతులకు పొదుపుపై అవగాహన


మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ దీపక్ కుమార్

జహీరాబాద్ టౌన్: సహకార బ్యాంకు జహీరాబాద్ శాఖ ఆధ్వర్యంలో మొగుడంపల్లిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొదుపు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ దీపక్ కుమార్ మాట్లాడుతూ సహకార కేంద్ర బ్యాంకు లో రైతులకు భద్రత కల్గిన పొదుపు పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. డిపాజిట్ల ద్వారా అధిక వడ్డీ లభిస్తుందన్నారు. .

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థినులు

నారాయణఖేడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చే 10 మంది పేద విద్యార్థినులకు నిజాంపేట ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థినులు పాఠశాలకు రాకపోకలు సాగించడానికి సైకిళ్లను వినియోగించుకొని ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సాధించాలని బ్రాంచ్ మేనేజర్ సురేశ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగదీశ్వరాచారి, హెచ్‌ఎం ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు దేవీసింగ్, సత్యనారాయణ, శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది తిరుమలరెడ్డి, అశ్వాక్ పటేల్, ఎల్లయ్య పాల్గొన్నారు.

కాలిపోయిన డ్రిప్ పైపులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని శేకాపూర్ పరిధిలో చెరకు తోటకు నిప్పు అంటుకుని డ్రిప్ పైపులు కాలిపోయాయి. ఇస్మాయిల్ కు మూడు ఎకరాల చెరకు తోట ఉంది. పంటకు నీరు అందించడానికి పొలంలో డ్రిప్ పైపులు పరిచాడు. గుర్తు తెలియని వ్యక్తులు పొలం పక్కన ఉన్న గడ్డికి నిప్పు అంటించారు. మంటలు తోటలోకి వ్యాపించి డ్రిప్ పైపులు, పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని, ఆదుకోవాలని ఆయన కోరారు.

సమస్యల వలయంలో హత్నూర ఐటీఐ

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్


హత్నూర ఐటీఐను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర ఐటీఐ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ డిమాండ్ చేశారు. హత్నూరలోని ఐటీఐ కళాశాలను శుక్రవారం ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులతో కలసి సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కళాశాలలో కనీసం సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కళాశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని, బోధించడానికి అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్ , ఎస్ఎఫ్ఐ హత్నూర మండల అధ్యక్ష కార్యదర్శులు మహేశ్, చందు, నవీన్, అభిషేక్, అకిల్, నందు తదితరులు పాల్గొన్నారు.

విద్యాపీఠం కృషి అభినందనీయం


జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

మాజీ మంత్రి జానారెడ్డి

సంగారెడ్డి టౌన్: ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాల్లో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం చేస్తున్న కృషి అభినందనీయమని ఉమ్మడి ఏపీ మాజీమంత్రి జానారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్మిస్తున్న 1.08 కోటి రుద్రాక్షలతో తయారు చేసిన శివలింగాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆశ్రమంలో కైలాస ప్రస్తార మహా పంచముఖ ఉమామహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం కూడా చేపడుతున్నట్లు ఈ సందర్భంగా జానారెడ్డికి విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి వివరించారు. ప్రకృతి నుంచి వచ్చిన వస్తువుల మాత్రమే దేవాలయంలో వాడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్ కుమార్, దారం సంజయ్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌటకూర్ ఎంపీడీవోగా శంకర్


ఎంపీడీవో బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్

సంగారెడ్డి: చౌటకూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శంకర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇందులోభాగంగా ఎంపీవో శ్రీకాంత్, కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ప్రీతం ,పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానం చేశారు.

డాక్యుమెంటు పోయినది

కమ్మరి కాళిదాసు తండ్రి కమ్మరి సుదర్శన్, వయస్సు: 49 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, ఇం.నం.11-181, శాంతి నగర్, హనుమాన్ గుడి సమీపాన, పటాన్‌చెరు (T & M), సంగారెడ్డి (D), తెలంగాణ రాష్ట్రం వాసినైన నేను నా యొక్క రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.7050/2002, తేది: 31-10-2002ను పటాన్‌చెరులో ఇల్లు షిఫ్ట్ చేస్తున్నప్పుడు తేది:10-02-2025న పోగొట్టుకున్నాను. ఎంతవెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో సంప్రదించగలరు. సెల్ : 9640963777

భక్తి భావం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న నీలం మధు

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: దేవాలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి నుంచి బయట పడటానికి ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆలయాల నిర్మాణానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. మాధవానంద సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వాదం అందజేశారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్, బీఆర్ఎస్ నేత మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక
అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

సంగారెడ్డిటౌన్ : బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలో అత్యాచారానికి గురైన ఎనిమిదేళ్ల బాలికను సఖీ కేంద్రంలో శుక్రవారం పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం కేఏ పాల్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు, నేరాలు పెరిగిపోయాయన్నారు.

హష్ ఆయిల్ స్వాధీనం

నిందితుడి అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి నుంచి గంజాయి నుంచి తీసిన హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్న ఘటన రామచంద్రాపురం పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం..రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఓ వ్యక్తి గంజాయి కలిగి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మహారాష్ట్రకు చెందిన గౌరవ్‌దిలీప్‌దోషి నిలుచున్నాడు. అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఓ సంచిలో గంజాయి నుంచి తీసిన 3కిలోల హష్ ఆయిల్ లభించింది. చంద్రశేఖర్, నవీన్‌లు ఒడిశా నుంచి తీసుకుని వచ్చి మధ్యలో తనకు ఇవ్వగా దానిని మార్కెట్‌లో అమ్ముకుని డబ్బులు సంపాదిస్తామని విచారణలో వెల్లడైంది. హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు గౌరవ్‌దోషిని రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

నారాయణఖేడ్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం ఖేడ్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖేడ్ నుంచి జహీరాబాద్‌కు వెళ్లే బస్సులు సమయపాలన పాటించేలా చూడాలని న్యాల్‌కల్‌కు చెందిన ఆనంద్, ఉమారాణి, శైలజ ఫోన్ చేసి కోరారు. ఖేడ్ నుంచి నాగూరు (బి)కు ఉదయం 8 గంటలకు బస్సు నడపాలని సురేఖతోపాటు మరో ఐదుగురు టీచర్లు విజ్ఞప్తి చేశారు. ఖేడ్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పర్మినెంట్ బస్సును నడపాలని పలుగ్రామాలకు చెందిన తోట అంజయ్య, శివకుమార్, రామకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, ఖేడ్ నుంచి వట్‌పల్లికి, రాయిపల్లి మీదుగా లింగంపల్లికి, ఖేడ్ నుంచి కంగ్టి, తత్కల్ మీదుగా పిట్లంకు బస్సులు నడపాలని పలువురు కోరారు. అదేవిధంగా ఖేడ్ నుంచి బోరంచ, రాయిపల్లి, కంకోల్, సదాశివపేటల మీదుగా లింగంపల్లికి బస్సును పునరుద్ధరించాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు విజ్ఞప్తి చేశారు. సమస్యలను నమోదు చేసుకున్న డీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారికి హామీనిచ్చారు.